
# రేసులు రాసులు

పవన్‌కుమార్



'ఒక పదిరూపాయలు సర్దుతావో' దాదాపు గంటన్నరనుండి అడుగుదామా వద్దా అని మనస్సులో మథనపడ్తున్న రంగనాథం చివరికి ధైర్యంచేసి, నోరుజారి రెండు నెలల్క్రితము క్రొత్తగా చేరిన ఎల్. డి. సి. ప్రకాశాన్ని అప్పు అడిగాడు.

తలవంచుకుని డ్రాయరు సొరుగులో వారపత్రిక ఉంచి చదువుతున్న ప్రకాశం రంగనాథం అప్పు అడిగేసరికి మెల్లగా 'సారీ! సార్! నేనే మిమ్మల్ని అడుగుదామని అనుకుంటున్నాను' మరోమాట అడగటానికి వీలులేకుండా తలదించి పుస్తకంలో మునిగిపొయ్యాడు.

ప్రకాశంమీద ఎంతో ఆశపెట్టుకున్న రంగనాథంతో అతను లేదని చెప్పటంతో ఒక్కసారి నిరాశ ఆవరించి తల తిరిగిపోయినట్లయింది.

మరోసారి అడుగుదామని నోటిదాకా వచ్చిందికాని, యింతలో తక్కిన గుమాస్తాలు రావటంతో మెదలకుండా వెళ్ళి సీట్లోకూర్చుని కాగితాలలో తల దూర్చాడు కాని మనసుమాత్రము పనిచెయ్యటం లేదు.

ఇక్కడ కొద్దిగా రంగనాథాన్ని గూర్చి చెప్పవలసి ఉన్నది. రంగనాథం అందరిలాగానే గవర్నమెంటు ఆఫీసులో మరోకొద్ది నెలల్లో రిటైరు కాబోతున్న యు. డి. సి. పెండ్లీడుకువచ్చిన ఒక ఆడపిల్ల, ఉద్యోగం లేకుండా తిరుగుతున్న ఒక కొడుకు, పదవ తరగతి చదివే ఒక అబ్బాయి, ఇప్పుడే బడిలోకి పోతున్న ఒక అమ్మాయి రంగనాథం కన్న సంతానం.

తాతలు, తండ్రులు ఏమి ఆస్తి యివ్వకపోయినా రంగనాథనికి తండ్రిగారికి ఉన్న గుర్రప్పందాల పిచ్చి మాత్రము బాగా పట్టింది. కాపురానికి వచ్చిన దగ్గరనుండి భార్య పెడుతున్న పోరు, ఆనాటినుండి ఈనాటివరకు రంగనాథానికి బూడిదలో పోసిన పన్నీరు లాగా చెవికి ఎక్కలేదు. పైగా భార్య కోపంతో ఏదన్నా అంటే నవ్వుతూ 'పిచ్చిదానా యిప్పటికి యిరవైయేళ్లనుండి ఆడుతున్నా, మరొక సంవత్సరమేగా' అంటూ వీధిలోకి పడుస్తాడు.

'నాన్నా! గుడ్డలు చినిగిపోయా'యని కూతురు ఎప్పుడన్నా నోరుజారి అడిగితే కళ్ళు వచ్చేది ఉందమ్మా, రాగానే కొని

కలతామే' అంటూ తల వంచుకొని, ఓక నిట్టూర్పు విడుస్తాడు.

ఈరోజు రంగనాథం, ప్రకాశాన్ని బదులు అడగటానికి కారణము రేపు గుర్రపు పందాల్లో పాల్గొనటానికి మాత్రమే గాని, మరే యితర ఖర్చుకికూడ కాదు. దాదాపు పదేళ్ళక్రితము కొండదొరకు చెయ్యి చూపితే 'నీవు ఏనాటికైనా లక్షాధికారి అయ్యే యోగం ఉందన్నాడు.' ఆ ఒక్క మాటే మనసులో అప్పటినుండి ఇప్పటివరకు మెదలుతూ ఉంటే, రెండు చేతులతో చెమటోడ్చి కష్టపడి సంపాదించిన జీతాన్ని, భార్య పిల్లలు కట్టుగుడ్డలు లేకుండా తిరుగుతూ ఉంటే, ఏ మాత్రము జాలి గాని, సిగ్గు గాని లేకుండా గుర్రప్పందాలకు ఖర్చు పెడుతున్నాడు రంగనాథం.

మొదట్లో రంగనాథం అప్పు అడగగానే 'పాపం! పిల్లల కలవాడ'ని బదులు యిచ్చేవారుగాని, గుర్రపు పందాల సంగతి తెలిసిన దగ్గరనుండి ప్రతి ఒక్కరు మొండి చెయ్యి చూపటం మొదలుపెట్టారు. రంగనాథం కూడ రెండుసార్లు అడిగి లేదనిపించుకొని, మళ్ళీ అడగటానికి మొఖం చాలక, దొరికిన చోటల్లా వడ్డీలకు తెచ్చి, అక్కడ అప్పు తీర్చలేక, అత్తగారు పెట్టిన భార్య నగలను హారతి కర్పూరంలాగా వెలిగించాడు.

నిన్నటినుండి ఎవరిని అడుగుదామా అని ఆలోచిస్తున్న రంగనాథానికి, క్రొత్తగా వచ్చిన ప్రకాశం కనపడ్డాడు. ఇంకా తన సంగతి తెలియదని అడిగాడు గాని, అతనికి కూడ తెలుసునని యిప్పుడు మాత్రమే రంగనాథం ఊహించాడు.

'ఏమోయ్, రంగనాథం రేపు పందాలకు పోతున్నావా' ప్రక్క యు. డి. సి. నారాయణరావు అడిగేసరికి, తలవంచుకొని, కాగితాలు చూస్తున్న రంగనాథం మెల్లగా 'జేబులో పైసలేదు. రేపటి సంగతి కదా' అంటూ తలవంచుకున్నాడు.

నారాయణరావు నలుగురిలోను ఎగతాళి చెయ్యటానికి అడుగుతున్న సంగతి రంగనాథం గ్రహించకపోలేదు.

'నీకేమిటోయ్ డబ్బులు లేకపోవటం, ఎక్కడనుండయినా తీసుకురాగల సమర్థుడవు, ఇంతకీ నెంబర్లు ఏమిటి' అప్పటివరకు అందరకు వినబడేట్లు మాట్లాడిన నారాయణరావు మెల్లగా బల్లపై రెండు మోచేతులానించి రంగనాథానికి దగ్గరగా తలపెట్టి అడిగాడు.

నారాయణరావు అందరిలోను ఆ విధంగా అడగటం రంగనాథానికి బాధగానే ఉన్నది గాని, నారాయణరావుతో స్నేహం ఈనాటిది కాదు. ఇద్దరూ ఒక్కసారి ఆఫీసులో చేరి, ఈనాటివరకు ఆ స్నేహానికి ఎటువంటి అడ్డంకులు రాకుండా గడుపుకొస్తున్నారు. రంగనాథం నారాయణరావును చూచి భయపడటానికి కారణం, భార్య లేని సమయములో, యింట్లోని వెండిచెంబును నారాయణరావు ద్వారా అమ్మించి భార్యకు మాత్రము దొంగలు ఎత్తుకుపోయినారని చెప్పి, దానికి సాక్ష్యంగా నారాయణరావు చేత నిజమనిపించటమే. దాన్ని ఎక్కడ బయటపెడతాడో అని రంగనాథంకి భయం.

'దాన్నిగురించి ఆలోచించలేదు' మెల్లగా వినబడనట్లు చెప్పాడు రంగనాథం.

'నువ్వు ఆలోచించకుండా వుంటావా' ప్రక్కనవున్న చిత్తుకాగితాల బుట్టను చూస్తూ 'నీవు అబద్ధం చెప్పినా, ఆ నోరు లేని బుట్టమాత్రము నిజం చెబుతుంది' అంటూ దానివంక చెయ్యిపెట్టి చూపాడు.

దొరికిపోయిన దొంగలా తల వంచుకున్నాడు రంగనాథం. నారాయణరావు అన్న మాటలు మరొకసారి జ్ఞప్తికి తెచ్చుకుని బుట్టవంక చూచాడు. దానినిండా తొమ్మిదిగంటలనుండి తను లెక్కలు వ్రాసి పడవేసిన కాగితాలే! డబ్బులు లేకుండా ఏం చెయ్యటానికి ఈలెక్కలన్నీ? తనకు తెలియకుండానే తనలోతాను ప్రశ్న వేసుకున్నాడు.

తనప్రశ్నకు సమాధానము ఆలోచించే లోపలే 'సార్! అయ్యగారు పిలుస్తున్నారు' అంటూ ప్యూను వెంకటస్వామివచ్చి పిల్చున్నాడు.

'ఎందుకు పిల్చారు' యథాలాపంగా అడిగాడు రంగనాథం.

'తెలియదండి,' నవ్వుతూ సమాధానమిచ్చాడు వెంకటస్వామి.

'ఆఖరికి ప్యూనుకు కూడా తన్ను చూస్తే లోకువే. వెధవ డబ్బుకోసం కక్కుర్తిపడి, చివరికి వాళ్ళదగ్గరకూడా పరువు పోగొట్టుకున్నా' తనలో ఒకసారి అనుకొని మెల్లగా చేతిలోని ఫైలుని టేబులుమీద పెట్టి ఆఫీసరుగారిరూంకి వెళ్ళాడు.

లోపలికిపోతున్న రంగనాథం నారాయణరావు ఎందుకు పిల్చింది వెంకటస్వామిని అడుగుతున్నది వినలేక పోలేదు.

'మీకు ఇన్నేళ్ళ సర్వీసు ఉంది, రెండు మూడు నెలల్లో రిటైరు కాబోతున్నారు, కాగితాలమీద కళ్ళు మూసుకొని సంతకాలు పెట్టటమేనా' దాదాపు అరకిలో బరువుగల ఫైలును రంగనాథం ముందుకు నెట్టాడు ఆఫీసరు.

'సారీ! సార్! ప్రొద్దుటినుండి వంట్లో బాగాలేదు' అంటూ ఆ ఫైలును తీసుకొని బయటకు వచ్చాడు.

అప్పటిదాక నవ్వుతున్నట్లున్నారు తక్కిన గుమాస్తాలంతా. రంగనాథం బయటకు రావటంతో ఒక్కసారి అంతా తలవంచుకొని కాగితాలు సర్దుతూ కూర్చున్నారు. ఒక్క టైపిస్టుమాత్రము ఇది ఏమి ఎరగనట్లు వయ్యారంగా టకటక మంటూ టైపు చేస్తుంది.

అరకిలోబరువుగల ఫైళ్ళను తనబల్ల మీదపెడుతూ టైపిస్టువంక చూచాడు.

పేరుకు తగినట్లుగానే మల్లీశ్వరి సినిమాలో మల్లీశ్వరిలాగానే వున్నది.

ఒకసారి ఆఫీసరు అన్నమాటలు మననం చేసుకుంటూ, ఫైలును తీసుకొని టైపు మిషన్‌దగ్గరకువెళ్ళి 'చూడమ్మా ఈకాగితం టైపుచేసింది నువ్వేగా' అంటూ ఫైల్లో కాగితం తీసి చూపించాడు.

'అవునండి' అంటూ నీళ్ళు నమిలింది మల్లీశ్వరి, రంగనాథం చూపిన కాగితం వంక చూస్తూ.

'నువ్వు చేసిన తప్పుకి నేను చివాట్లు తినవలసి వచ్చింది. నేనేదో పరధ్యానంగా నీవు టైపు చేసిన కాగితంపై కరక్టుగా వున్నట్లు సంతకం చేస్తే, ఆఫీసరుగారు నన్ను చివాట్లు పెట్టారు.'

మల్లీశ్వరి తప్పయినట్లుగా తల వంచుకుంది.

పాపం! రంగనాథం మాత్రము ఏమి చేస్తాడు. ఆమె తప్పుకాదది. కాని ప్రారబ్ధ ఖర్మ అనుకుంటూ, టైపు కాగితాన్ని చించివేసి, మరొకసారి జాగ్రత్తగా టైపు చెయ్యమని చెప్పి, తన సీటులోకి వెళ్ళి కూర్చున్నాడు.

సాయంత్రముదాకా రంగనాథం కాలు

కాలేజి పిల్లలా అటు ఇటు తిరుగుతున్నాడు గాని ఎవరిని ఒక్క పైసాకూడ అడగలేదు. అడిగినా యివ్వరనికూడ తెలుసు. అదిగాక ప్రతి ఒక్కరు, డబ్బులు యివ్వటానికి యిష్టములేక ఉంచుకొనిగూడ 'సారీ! సార్' అంటూ తప్పుకుంటున్నారు. ఒక ప్రక్క రేపు పందాలకు పోగూడదని అనుకుంటున్నా రెండవ వైపు మాత్రము 'వచ్చే అదృష్టము రేపు ఎందుకు రాకూడదు. ఒకటి గాదు రెండుగాదు నాలుగు లక్షలు' అనే రంగనాథం మనసులోని మాటలకు సాక్ష్యంగా గోడ గడియారము ఐదుగంటలు కొట్టింది.

అందరూ వెళ్లిపోయినా, రంగనాథం మాత్రము ఫైల్సు ముందర పెట్టుకొని పని ఉన్నట్లు అడిగినవాళ్లతో చెప్పాడు. కాగితాలపై ఉన్న అక్షరాలు మాత్రము పరిగెత్తే రేసు గుర్రాలులాగా కన్పడుతున్నాయి. అందరూ వెళ్లిన తర్వాత చివరికి వాచ్‌మన్‌ను కూడ అడిగాడు. 'ఒక పదిరూపాయలుంటే సర్దమని.' ఆ సమయములో రంగనాథం తన అవసరంకోసము తాత్కాలికంగా ఉద్యోగపు అంతస్తు మర్చిపోయినట్లున్నాడు. వాడు నవ్వుతూ 'అదేమిటి దొరా మీ దగ్గర మేము తీసుకోవాలి గాని, పేదవాళ్లము మా దగ్గర ఎక్కడ ఉంటాయి సార్, ఈ కరువు రోజుల్లో' అంటూ రంగనాథం నాలుగు రోజులనుండి దాచుకున్న రెండు పైసలను బీడీలకని

# రేసులు-రాసులు

అడిగి తీసుకున్నాడు.

వాడి నవ్వు చూచిన తర్వాత, అడగకుండా వుండాలనిపించిందిగాని, నోరుజారిన తర్వాత లాభం లేదనుకొని, మెదలకుండా నిమిషాలు లెక్కపెట్టుకుంటూ, చివరి ప్రయత్నము కూడ వృధా అయిందను కున్నాడు.

రంగనాథం యింటిగడపమీద అడుగు పెట్టే వేళకు ప్రక్కవాళ్ల గడియారము ఎనిమిది కొట్టింది. గడపలో కూర్చున్న భార్యను చూచినతర్వాతగాని గుర్తుకు రాలేదు యింట్లో బియ్యం నిండుకున్న విషయము. వెనక్కు వెళ్లి ఎక్కడన్నా అప్పు తెద్దామన్నా యిచ్చే పుణ్యాత్ముడు లేడు. పందాలకు కాదు బాబూ! యింట్లో పిల్లలు పస్తులున్నారని మొత్తుకున్నా నమ్మి, పైసా యిచ్చే ధర్మాత్ముడుకూడ లేడు.

భర్తకోసరము ఎదురుచూస్తున్న సావిత్రమ్మ, భర్తరాగానే విసుక్కుంటూ 'బియ్యంలేవని ప్రొద్దున చెబితే, సాయంత్రము పెందరాడే వస్తానని వెళ్లి, ఇప్పుడా రావటము, పిల్లలందరూ అన్నాలు లేకుండా పడుకున్నారు.'

ఆఫీసు తొందరలో, బియ్యము సంగతే మర్చిపోయ్యాను' తన తప్పు లేదన్నట్లుగా మెల్లగా కుర్చీలో కూర్చున్నాడు.

'అందరూ కూర్చున్నారా, మీ రొక్కరేనా...' అంటూ యింకా ఏదో అనబోయింది గాని 'అబ్బ! అబ్బ! కాస్త విశ్రాంతిగా కూర్చోనియ్యవే, ఇప్పటికే తలకాయ బద్దలవుతుంది' అంటూ రెండు చేతులతోను తలపట్టుకొన్న భర్తనుచూచి మరోమాట మాట్లాడలేకపోయింది ఆ దొడ్డయిల్లాలు.

భార్య కాస్త శాంతంగా వుండటంతో 'అబ్బాయి వచ్చాడా' మెల్లగా అడిగాడు.

'ఎక్కడికి వెళ్లాడో ఏమో! ఇంత వరకు రాలేదు. చెప్పులు తెగిపోయినాయిట వాడు ఒకటే గోల చేస్తున్నాడు.'

'వాడికి చెప్పులు తెగిపోతే, నాకు అరిగి పోయినాయి చూడు' అంటూ రెండు కాళ్లను చూడమన్నట్లుగా భార్యవైపుకు చాపాడు.

'మీకేం ముసలివాళ్లు, ఎట్లావున్నా ఫర్వాలేదు'

'అంతేలే అప్పులపాలైన భర్తనుచూస్తే ప్రతి ఆడదానికి లోకువే' అని యింకేదో అనబోయినాడు గాని, యింతలో వాకిట్లో నుండి కేక వినపించటముతో రంగనాథం నోరు మూయటం, సావిత్రమ్మ వాకిట్లోకి వెళ్లటం జరిగింది.

సావిత్రమ్మ లోపలికి వచ్చేసరికి రంగనాథం ఆకలిమంటతో కళ్లు మూసుకొని తూలుతూ ఉన్నాడు. భార్య యిచ్చిన మజ్జిగనీళ్లు త్రాగి, అర్ధాకలితోనే ఆఖరిదాని మంచముమీద కాళ్లు ముడ్చుకొని పడుకున్నాడు, తన జీవితాన్ని తలుచుకుంటూ. ఈవిధంగా ఇప్పటికి ఎన్ని రాత్రులు గడిపాడో! 'మానాన్న పండక్కి క్రొత్తగుడ్డలు, బొమ్మలు, తెస్తానన్నాడుగా' నిద్రలో కలవరిస్తుంది ఆఖరిపిల్ల. 'ఎంత ఆశ పెట్టుకున్నావు తల్లి ఈ నిర్భాగ్యుడిమీద' తనకు తెలియకుండావే వచ్చిన కన్నీరుని తుడుచుకుంటూ కళ్లు మూసుకొని పడుకున్నాడు.

భర్తకు అన్నంలేదని మజ్జిగయిచ్చిన సావిత్రమ్మకొడుకు రావటంతో వంటింట్లోకి వెళ్లి అన్నంపెట్టి రావటం రంగనాథం కళ్లు మూసుకొనే చూచి, కట్టుకున్న భార్యగూడ మోసం చేస్తున్నదని కాసేపు బాధపడ్డాడు. ఆ బాధను మర్చిపోవటానికి మనస్సును మరోప్రక్కకు మళ్లించాడు.



# రేసులూ—రాసులు

'తెల్లవారుతుండగానే ... పిల్లలిద్దరూ కొట్టుకోవటం మొదలుపెట్టారు. నిద్ర మంచముమీదనుండి లేస్తున్న రంగనాథం పిల్లల నిద్దరిని రెండు దెబ్బలు కొట్టి, పిల్లల ఏడుపుకు కారణమయిన పెద్ద కొడుకును చివాట్లుపెట్టాడు. తండ్రి మాటకు ఎదురు చెప్పని ఆ తనయుడు త్రాగే కాఫీగ్లాసును అక్కడ పడవేసి వీధిలోకి వెళ్ళిపోయ్యాడు. కొడుకు సగం కాఫీని వదిలి వెళ్ళేసరికి పావిత్రమ్మ భర్తమీద లోలోపల సణుక్కుంటూ అటుఇటు తిరగటం మొదలుపెట్టింది.

'ఆకలి' అంటూ గోలచేస్తున్న పిల్లలిద్దరికీ అటుకులుపెట్టి ఆడుకోటానికి పంపటం వాకిట్లో కూర్చున్న రంగనాథం చూస్తూనే ఉన్నాడు చేసేది ఏమీలేక.

భార్యయింట్లోకి పోగానే ఆఖరివాడిచేత వాలడబ్బాలోనుండి లాటరీ పద్ధతిలో ఒక కాగితాన్ని తీయించి, హుషారుగా ఒక నవ్వు నవ్వుకున్నాడు పాపం రంగనాగం.

ఎక్కడో ఆలోచిస్తున్న రంగనాథం భార్య చేటలో బియ్యం పోసుకొని గడప దగ్గరకూర్చుని బాగుచేస్తున్న శబ్దానికి ఈలోకంలోకి వచ్చాడు.

'బియ్యం లేవంటివిగా ఎక్కడివి ?' మెల్లగా భార్యను అడిగాడు.

'మీరు చేతులు ముడుచుకుని కూర్చున్నారని, నే ఊరుకుంటే నలుగురూ దుమ్మెత్తరూ—ఆడదాన్ని ఎక్కడన్నా అడుక్కొచ్చి పెట్టక తప్పదుగా.'

'నామీద కోపం బియ్యంమీద చూపితే, ఆ కాసిని బియ్యంకూడ వుండవు' విసురుగా బాగుచేస్తున్న భార్యను చూస్తూ అన్నాడు.

పావిత్రమ్మ మాట్లాడకుండా బియ్యం బాగుచేస్తున్నది.

'అమ్మాయి ఏం చేస్తున్నది ?'

'దొడ్లో గిన్నెలు తోముతున్నది, అలవనా !'

'అక్కర్లేదు, కన్పడకపోతే అడిగాను' అంటూ అప్పటిదాకా కుర్చీలో కూర్చున్న రంగనాథం మెల్లగా భార్య ప్రక్కన వచ్చి కూర్చున్నాడు.

'ఈ వయసులోకూడ సరసాలా' ప్రక్కన కూర్చున్న భర్తను చూచి విసుక్కుంది పావిత్రమ్మ.

'ఛీ! ఛీ! నీకెప్పుడూ అదే భయము' తనలో తాను నవ్వుకుంటూ 'ఒక పది రూపాయలుంటే చూడవే' మెల్లగా తాను ప్రక్కన కూర్చున్న కారణం చెప్పాడు.

'సిగ్గులేకపోతే సరి అడగటానికి, రాత్రి బియ్యం లేవని పస్తులు పడుకున్నారు, ప్రొద్దున్నే డబ్బులు కావాలిట, నేను మాత్రను ఎక్కడ తెచ్చేది.'

'చూడవే నీవు తల్చుకుంటే ఎక్కడైనా తీసుకువస్తావు.'

'ప్రక్కింటి భాగ్యలక్ష్మిగారికి ఇప్పటికే పదిరూపాయలు యివ్వాలి, ఆమె దగ్గరకూడ లేనట్లుంది. నిన్ననే ఎవరికో యిచ్చింది.'

'మారమ్మకాదో వీరమ్మ, ఆమెకాకపోతే మరోకామె, యింకో గంటలో చూడవే పుణ్యముంటుంది' ప్రాధేయపడుతున్నట్లుగా అడిగాడు.

'నేను అడుక్కొస్తుంటే తమరేమో గుర్రాలకు ధారపోసి రండి' అంటూ బాగుచేసిన బియ్యాన్ని తీసుకొని లోపలికి వెళ్ళిపోయిన భార్యను చూస్తూ గడపలో కూర్చున్నాడు రంగనాథం రెండు చేతులు నెత్తిన పెట్టుకొని, ఏమి చెయ్యాలో తోచక.

బియ్యం తీసుకువెళ్ళిన పార్వతమ్మ పావుగంట తర్వాతగాని బయటకు రాలేదు. వస్తూనే నెత్తిన చేతులు పెట్టుకొన్న భర్తను చూస్తూ 'ఇంకా అట్లాగే కూర్చున్నారేమండి, త్వరగా స్నానం కానీయండి భోజనము చేద్దురుగాని'

'నా సంగతి ఏమి చేసావు' దీనంగా అడిగాడు రంగనాథం.

'నన్నేమి చెయ్యమంటారు చెప్పండి, ఒక్క పుస్తె తప్ప మెడలో మరో నగకూడ లేదు, తాకట్టు పెట్టటానికి'

'అదివ్వరాదు' భార్యకు వినీ వినపడనట్లుగా గొణిగాడు.


'ఏమన్నారు' భర్త మాటలు సరిగ్గా వినబడనట్లుంది పావిత్రమ్మ ఒక్కసారి బిగ్గరగా అడిగింది.

'ఆ మంగళసూత్రపు త్రాడు యివ్వరాదు, అదృష్టము కలిసివస్తే సాయంత్రానికి వాలపునగలు పెట్టుకోవచ్చు' మెల్లగా చెప్పాడు, ఎక్కడ కూతురు వింటుందోనని భయపడుతూ.

'ఇప్పటికి ఎన్ని అదృష్టాలు కలిసి వచ్చినాయి' మరోమాట అనకుండా లోపలికి వెళ్ళిపోయింది పార్వతమ్మ.

రంగనాథం మాత్రము తను కూర్చున్న చోటునుండి ఒక్క అడుగుకూడ కదల్చకుండా కూర్చున్నాడు తిరిగి భార్య వచ్చే వరకు.

'నేను చస్తేగాని మీకు సంతోషం వుండదు.' అంటూ మెడలోని మంగళ



సూత్రాన్ని తీసి భర్తవడితో విడిచేసి ఎట్లా వచ్చిందో అట్లాగా లోపలికి వెళ్ళిపోయింది కళ్ళనీళ్ళతో పార్వతమ్మ.

వళ్ళోపడ్డ మంగళసూత్రము రంగనాధానికి మొదట్లో పాములాగా కన్పడ్డది గాని, తన అదృష్టాన్ని గుర్తుకు తెచ్చుకునేసరికి పూలదండలా కన్పడ్డది.


మంగళసూత్రాన్ని చూచిన మార్వాడీ రంగనాధాన్ని ఒక్కసారి, గోడమీద కాలెండరు ఒక్కసారి, టేబులుపై గడియారాన్ని మరొక్కసారి చూచి దాదాపు రెండు వందల రూపాయల సగికు ఒక యాభై రూపాయలు మాత్రము యిచ్చాడు లాకటు పై.

రంగనాధం రేసుల దగ్గరకు వెళ్ళేసరికి విపరీతమయిన జనం వున్నారు. తన చిన్న కొడుకు తీసిన నెంబరు వ్రాసి, ఒక వేడి నిట్టూర్పు విడిచి హోటల్ వైపుకు దారి తీసాడు తన అదృష్ట దురదృష్టాలను తలచుకుంటూ. డబ్బు లేదన్న ప్రకాశరావు, నారాయణరావు ప్రక్కనుండి వెళ్ళినాకూడ రంగనాధం చూడలేదు. వాళ్ళిద్దరూ రంగనాధాన్ని చూచి నవ్వుకున్నారు.

అదృష్టము కలిసివస్తే ఎక్కడున్నా వెతుక్కువస్తుంది. రిక్షావాడు లక్షాధికారి అవుతాడు, చచ్చిపోయ్యేవాడు బ్రతికి బట్టకడతాడు. ఎన్నో సంవత్సరాలనుండి వస్తుంది! వస్తుంది! అని ఎదురు చూచిన అదృష్టలక్ష్మి రంగనాధాన్ని వరించింది. ఒకటి గాదు, రెండు గాదు నాలుగు లక్షల రూపాయలు, జీవితాంతము కష్టపడ్డా దానిలో యాభైవవంతు గూడ సంపాదించలేని రంగనాధం సాయంత్రానికల్లా లక్షాధికారై కూర్చున్నాడు. నిన్నటివరకు వస్తులు పడుకున్న భార్యా బిడ్డలు రేపటినుండి సర్వసౌఖ్యాలు అనుభవించ బోతున్నారు మంగళసూత్రము లేక నల్లపూసల త్రాడుతో తిరుగుతున్న పావిత్రమ్మ రేపు వారాలసొమ్ము పెట్టుకోబోతుంది. హే! భగవాన్! ఏమిటి నీ లీల!

'అమ్మ కన్పించటములేదు నాన్నా' వాకిట్లో టాక్సీ దిగిన రంగనాధాన్ని

# డా॥ యం. ఎస్. స్వామినాధన్



భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రొత్త ఢిల్లీ) డైరెక్టర్ డా. యం. ఎస్. స్వామినాధన్ యువశాస్త్రవేత్తల్లో అసామాన్య ప్రతిభ కలవారు. ఈ సంస్థ మనదేశంలో వ్యవసాయ పరిశోధనా సంస్థల్లో అగ్రశ్రేణికి చెందిన కేంద్రం. దీనికి యిదివరలో డా: బి. వి. నాథ్, డా: జె. ఎన్. ముఖర్జీ, డా: బి. పి. పాల్ వంటి సీనియర్ శాస్త్రవేత్తలు డైరెక్టర్లుగా వున్నారు. అటువంటి పదవికి 40 సంవత్సరాల వయస్సులోనే డా: స్వామినాధన్ నియమించబడ్డారంటే ఆయన అర్హతలు, అంతర్జాతీయంగా ఆయన సంపాయించిన పేరు ప్రతిష్ఠలు తెలిసినవారికి ఆశ్చర్యం కలగదు. అంతర్జాతీయ జీవోత్పత్తి శాస్త్ర (జనిటిక్స్) మహాసభకి (1963) ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన మొదటి భారతీయుడు ఈయనే. జీవోత్పత్తి శాస్త్రానికి పునాదులు వేసిన మెండల్ సిద్ధాంతాల శతవార్షికోత్సవం సందర్భంగా జకోస్లావాక్ సైన్స్ అకాడమీవారు 1965 లో బహూకరించిన మెండల్ మెమోరియల్ పతకాన్ని అందుకున్నవారు, ఆసియాలో డా: స్వామినాధన్ ఒక్కరే.


డా: స్వామినాధన్ 1925 లో కుంభకోణంలో పుట్టారు. కోయంబత్తూరు వ్యవసాయ కళాశాలలో బి. యస్‌సి. (అగ్రికల్చర్) డిగ్రీ, ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్ (క్రొత్తఢిల్లీ) లో ఉన్నత డిప్లొమా తీసుకున్నాక వెగనింగన్ (నెదర్లాండ్స్) లో ప్రసిద్ధ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో కొన్నాళ్ళు పనిచేసి, తర్వాత కేంబ్రిడ్జి యూనివర్సిటీ పి. హెచ్. డి. డిగ్రీ తీసుకున్నారు. 1952-53 లో విస్కాన్‌సిన్ విశ్వవిద్యాలయంలో (అమెరికా) పరిశోధనలు జరిపారు. వీరి పరిశోధక వ్యాసాలు 200 దాకావున్నాయి ఇవిగాక కొన్ని గ్రంథాలు కూడా వున్నాయి. వీరి దర్శకత్వంలో 30 మంది పి. హెచ్. డి. డిగ్రీ తీసుకున్నారు.

మేలురకం పంటల్ని సృష్టించడానికి కిరణ ప్రసరణాలని, అణుశక్తిని ఉపయోగించడంలో డా: స్వామినాధన్ కృషి ఆయనకు అంతర్జాతీయంగా పేరు తెచ్చింది. గోధుమ, వరి ధాన్యాల్లో ప్రోటీన్‌లు అధికంగా వుండే కొత్తరకాల్ని వీరి బృందంవారు సృష్టించారు. 1960 లో మెక్సికోనుంచి పొట్టి రకం గోధుమ జాతిని మనదేశంలో ప్రవేశపెట్టడానికి వీరే కారకులు. జనుము పంట అభివృద్ధికి కూడా వీరి పరిశోధనలు తోడ్పడుతున్నాయి.

డా: స్వామినాధన్ అనేకదేశాల్లో పర్యటించి ఉపన్యాసాలిచ్చారు. జీవశాస్త్రంలో ఉత్తమ పరిశోధనకి 1961 లో శాంతిస్వరూప్ భట్నాగర్ మెమోరియల్ బహుమానం, తిమిరిజెవ్ అకాడమీ పతకం, భారత జీవోత్పత్తి శాస్త్ర సమితివారిచ్చే పతకం, భారత వృక్షశాస్త్ర సంఘంవారి బీర్బల్ సాహ్ని పతకం వీరికి లభించాయి.

శాస్త్రజ్ఞులు సాంఘిక, ఆర్థిక పురోగమనానికి తోడ్పడాలని డా: స్వామినాధన్ గట్టి నమ్మకం. అందుకు శాస్త్రజ్ఞులు సేకరించిన ఫలితాల్ని సామాన్యప్రజల అందుబాటులోకి తేవడం చాలా అవసరం. ఇది గుర్తించి "నేషనల్ డిమాన్‌స్ట్రేషన్ ప్రోగ్రాం" వంటి కార్యక్రమాల్ని వరు రూపొందించారు. వీటి ద్వారా వ్యవసాయదారులకి చాలా ప్రయోజనం చేకూరుతోంది. చిన్నపిల్లలకి ఆహారంలో లగినంత ప్రోటీన్ లభించకపోతే రాబోయే సంవత్సరాల్లో దేశంలో మేధాసంపత్తి కుంటుపడే ప్రమాదం వుందని డా. స్వామినాధన్ హెచ్చరిక.

—డా॥ ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి



# మొసలి

## రంగులరత్నం

విషం లేకపోయినా మొసళ్ళు కూడా పాముల లాగే— అంతకన్నా— ఘోరమైనవి. పాములు ఆత్మరక్షణకోసం మనినిషిని కాటు వేస్తాయి. కాని కొన్ని మొసళ్ళు అవకాశం దొరికితే మనిషిని అమాంతం లాక్కుపోతాయి. మొసళ్ళలో మూడు, నాలుగు రకాలున్నాయి. అసలయిన మొసళ్ళు నైలునది (ఈజిప్టు), ఇండియా లోనూ ముఖ్యంగా ఉన్నాయి. యాలిగేటర్ అనేది ఒక రకం మొసలి. అచ్చం మొసలిలాగే ఉంటుంది. కాని ముట్టె కొంచెం వెడల్పుగా ఉంటుంది. మొసళ్ళలో కొద్దిగా కూనుగా ఉంటుంది. గేవియల్ అనేది మూడో రకం మొసలి. దీని తల చివర సన్నగా పొడవుగా ఉంటుంది. ఇది గంగా, బ్రహ్మపుత్రా నదుల్లో ఉంటుంది. కైమాన్ అనేది నాలుగో రకం.

నైలు మొసలి చాలా ఘోరమయింది గంటల తరబడి నది ఒడ్డున చలనం లేకుండా పడి ఉంటుంది. చూడ్డానికి కర్రముద్దలాగే ఉంటుంది. కాని జంతువు ఏదైనా రాంగానే వెంటనే పట్టి వేస్తుంది. చిన్నదయితే చేప లాగా—వెంటనే మింగుతుంది. కొంచెం పెద్దదయితే వేళ్లనపాయం కావాలి. నోటిలో వాడి దంతాలు ఉంటాయి. ఇవి నమలడానికి పనికి రావు కాని, జంతువు తప్పించికొనిపోకుండా నొక్కిపట్టి ఉంచుతాయి. వెనకకాళ్ళు ముందుకు తెచ్చి వాటికున్న మూడు వాడి గోళ్లతోటి (రెండు వేళ్లకి వాడిగోళ్ళుండవు) ఆహారాన్ని చీల్చి ఖండాలుగా చేస్తుంది. పెద్ద పెద్ద జంతువు లయితే నీటిలోపలికి లాక్కోపోయి వూపిరి రాకుండా చేసి చంపుతాయి. ఆ తరువాత సావకాశంగా తింటాయి. దొరికితే మనిషిని కూడా ఇలాగే చేస్తాయి.

యాలిగేటర్లు అమెరికా, చైనాలో ఉన్నాయి. ఇవికూడా బలమైనవేకాని, మనిషంటే కొంచెం భయం, బెరుకూ ఉన్నాయి. మనిషి కనబడగానే పోతాయి. మొసళ్లంత ఘోరంగా ఉండవు. గేవియల్ వీటితో పోలిస్తే ఇంకా మంచిది. గంగానదిలో ఉండే ఇవి, మనిషి కనబడగానే నీటిలోకి పోతాయి. కళ్ళు ముక్కు రంధ్రాలు మాత్రం పైకి ఉంచుతాయి. మిగతా శరీరం అంతా నీటిలో దాచి పెట్టుకొంటాయి.

ఏదైనా జంతువును చంపి, నమ్మగా తిన్నాక అయ్యో పాపం! అని మొసలి కన్నీళ్లు కారుస్తుందని ఒక అభిప్రాయం ఉంది. అందుకే "మొసలి కన్నీళ్లు" అనే నానుడి వచ్చింది. అయితే నిజానికి అది కల్ల! అటువంటి కన్నీళ్లు మొసళ్ళు కార్చవు.

—జమ్మి కోనేటిరావు.

## రేసులు-రాసులు

చూస్తూనే పెద్ద కూతురు గాభరాగా చెప్పింది.

'ప్రక్కింటివాళ్ళింటికేమన్నా వెళ్ళిందేమో చూడండి' టాక్సీవాడికి, భార్య మంగళసూత్రము తాకట్టుపెట్టగా వచ్చిన డబ్బును నయాపైసలుసహా యిచ్చివేస్తూ అడిగాడు.

'అన్నయ్య అందరింటికి వెళ్ళి వచ్చినాడు నాన్నా, ఎక్కడా లేదు' కళ్ళ నీళ్ళు కారుస్తూ చెప్పింది పెద్దకూతురు

'నేను కనుక్కువస్తాను, మీరు భయపడకండి' అంటూ తెలిసిన వాళ్ళందరి యింటికి వెళ్ళి అడిగాడు. ప్రతివాళ్ళూ రంగనాథానికి వచ్చిన అదృష్టాన్ని గుర్తుకు తెస్తున్నారుగాని పార్వతమ్మ సంగతి మాత్రము తెలియదంటున్నారు అప్పుడే ఇంతమందికి ఎట్లా తెల్సిందో? యింతకీ భార్య కన్పడలేదనే దిగులు భరిస్తున్న రంగనాథం మనసులో అనుకున్నాడు.

పోలీసు రిపోర్టు యిద్దామని పోతున్న రంగనాథం 'బావిలో ఎవరో ఆడకూతురు పడ్డది' అనుకుంటూపోతున్న రిక్షావాళ్ళని పిలిచి ఆ బావి ఎక్కడ వున్నదో వివరాలు అడిగి, తెల్సుకున్నాడు. ఆ శవము తన భార్యది కాగూడదని తెలిసిన దేముళ్ళందరికి మొక్కి ఆబావివగ్గరకు చేరుకున్నాడు రంగనాథం. అప్పటికే పోలీసులు శవాన్ని బయటకు తీసి, గట్టుమీద గుడ్డకప్పి వుంచారు

భయపడుతూనే గుడ్డ తొలగించిన రంగనాథం 'సావిత్రీ' అంటూ ఆమెమీద పడి ఏడ్చాడు. కాని ప్రయోజనం? యింటిలక్ష్మి వెళ్ళిపోతేగాని ధనలక్ష్మి ఆ గృహప్రవేశము చేయనన్నదేమో! ఏ మంగళసూత్రముతో తాను లక్షాధికారైనాడో, ఆ మంగళసూత్రముతోనే తన భార్యను పసుపు కుంకమలతో మరో ప్రపంచానికి పంపించినాడు రంగనాథం. సావిత్రమ్మ తన భర్త ఆనందముకోసము తన బిడ్డలను తల్లిలేని అనాథులుగా చేసి తన భర్తకు వచ్చిన అదృష్టాన్ని పైనుండి చూసి సంతోషపడుతుంది గాబోలు !